

కథా కౌముది

# కలయో వైష్ణవమాయయో.. పి.రాజేంద్రప్రసాద్

నిన్న సాయంత్రం అమ్మా, నాన్నగారు చుట్టాలింట్లో పెళ్లి సందర్భంగా దగ్గరలోనే ఉన్న అనకాపల్లి వెళ్ళారు. విశాల్ ఒక్కడే ఇంట్లో ఉన్నాడు. అమ్మ వెళుతూ వెళుతూ వంట చేసేసి వెళ్ళింది. విశాల్ రాత్రి భోజనం చేసి కొద్దిసేపు తన పుస్తకాలు చదువుకొని పడుకున్నాడు. ఉదయం లేచేసరికి ఏడయ్యింది. లేచీ లేవగానే బెడ్ రూమ్ కిటికీ తలుపులు తెరిచి కిందకు చూశాడు. కింద వాచ్ మాన్ భార్య రత్తాలు నైటీలో వాళ్ళ రూమ్ ముందర చీపురుతో ఊడుస్తోంది. విశాల్ లోని యవ్వన రక్తం వేడెక్కింది. ఇంట్లో తను తప్ప ఇంకెవరూ లేరు. నల్లగా ఉన్నా, బొద్దుగా, అందంగా, దాదాపు పాతికేళ్ల వయస్సున్న, పిల్లలు లేని రత్తాల్ని అలా ఎంతసేపు చూసినా అడిగేవాడే లేదు. రత్తాలు భర్త, బిల్డర్ చెప్పిన పనిమీద ఊరెళ్ళాడని విశాల్ కు తెలుసు. అలాగే ఆమె అటూ ఇటూ తిరుగుతుంటే రెప్పలార్పకుండా చూస్తూ ఉండిపోయాడు. రత్తాలు ఊడవడం ముగించి లోపలికి వెళ్ళిపోయింది. టైమ్ చూసుకున్నాడు. ఏడున్నరయ్యింది. "తొందరగా పనులు కానివ్వాలి." అనుకుంటూ లేచాడు.

బ్రష్ చేసుకుని, స్నానం చేశాడు. అమ్మ నిన్న తయారు చేసి ఉంచిన ఇడ్లీలు, చట్నీలను ఓవెన్ లో రీహీట్ చేసుకుని తన టేబుల్ మీద పెట్టుకుని "బాగున్నాయి." అనుకున్నాడు. యాధాలాపంగా కిటికీ లోంచి మళ్ళీ కిందకు చూశాడు. రత్తాలు గుండెల వరకూ లంగా మీద టవల్ కప్పుకొని చేతిలో మారు బట్టలతో వాళ్ళ రూమ్ పక్కన ఉన్న రేకుల షెడ్డు బాత్ రూమ్ లోపలికి వెళ్ళింది. విశాల్ అలా బాత్ రూమ్ వైపు చూస్తూ ఏదేదో ఊహించుకుంటూ ఉండిపోయాడు. రత్తాలు స్నానం ముగించి, శుభ్రమైన మెరూన్ కలర్ చీర, జాకెట్టు ధరించి బయటకు వస్తూ పైకి చూసింది. కిటికీ లోంచి కళ్ళు ఇంతింత చేసి చూస్తున్న అతనివైపు కొరకొరా చూసింది. విశాల్ బెదిరి తలను వెనక్కి తీసుకోబోయాడు. రత్తాలు కోపంగా "జాగ్రత్త!" అన్నట్టు తర్జని చూపించింది. విశాల్ తలవంచుకుని కిటికీ తలుపు మూసేసి ఇడ్లీ తినడం స్టార్ట్ చేశాడు.

వెంకటరావు, అన్నపూర్ణలకు ఒకే కొడుకు విశాల్. వాళ్ళ మొదటి సంతానం అమ్మాయికి పెళ్ళైపోయి అత్తారింటిలో ఉంది. విశాల్, భీమిలీకి దగ్గరలోనే ఉన్న ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైకాలజీలో ఎం. ఏ. ఫైనల్ ఇయర్ చదువుతూ ఉన్నాడు. విశాల్ వాళ్ళ డాడీ వెంకటరావుగారు ఈ మధ్యనే బీచ్ కు దగ్గరగా ఉన్న గేటెడ్ కమ్యూనిటీలో ఒక అపార్ట్ మెంట్ తీసుకున్నారు. ఆ కమ్యూనిటీలో ఇంకా కొన్ని అపార్ట్మెంట్లు కన్స్ట్రక్షన్ అవుతూనే ఉన్నాయి.

ఫస్ట్ ఫ్లోర్ లో ఒక కార్నర్లో ఉన్న వీళ్ళ అపార్ట్ మెంట్ కి క్రిందనే వాచ్ మాన్ రూమ్ ఉంది. వాళ్లకు చిన్నజాగాలో నాలుగు గోడలు మాత్రం కట్టించి దానిని వాళ్ళకి బాత్ రూమ్ గా వదిలేశాడు బిల్డర్ . పాపం వాచ్ మానే ఆ గోడల మీదకు సగం విరిగిన రేకు ఒక్కటి పైనవేసి బాత్ రూమ్ ఉన్నది అనిపించాడు. ప్రస్తుతం విశాల్ కు ఇచ్చిన చిల్డ్రన్ బెడ్ రూమ్ లోంచి వాళ్ళ బాత్ రూమ్ ఎదురుగా కనబడుతుంది. ఇప్పుడు విశాల్ ఈ పాడుపని చేసి రత్తాలుకు పట్టుబడింది అందువల్లనే.

విశాల్ కు బుర్రంతా పాడైపోయింది. అన్యమనస్కంగా ఇడ్లీ తినడం పూర్తి చేసి, ఫోన్ లో సోషల్ మీడియా పోస్టులు చూడసాగాడు. "అంతరించిపోతున్న రాబందుల జాతి." అనే శీర్షిక కింద తినడానికి యధేచ్చగా శవాలు దొరకనందువల్ల రాబందుల జాతి ఎలా అంతరించిపోతోందో గణాంకాలతో సహా విపులంగా రాశారు. పర్యావరణానికి ఏ విధమైన హాని జరుగుతున్నదో కూడా వివరంగా రాశారు. "ఏడిశాడు వెధవ.. పర్యావరణమూ వీడి ముఖమూ. ఏమౌతుందో పర్యావరణానికి. పాములు, తేళ్ళు, బల్లులు, పులులు, సింహాలు ఇవన్నీ మనకవసరమా! ఏదేదో రాస్తారు పిచ్చి వెధవలు..." అనుకున్నాడు. టైమ్ చూసుకున్నాడు. ఎనిమిది దాటి పది నిమిషాలయ్యింది. "ఇప్పుడు బయలుదేరితే తొమ్మిదింటికి కాలేజీ చేరుకోగలం." అనుకుంటూ ఇంటికి తాళం వేసి తల్లిదండ్రులకి మాత్రమే తెలిసేలా తాళం చెవి బయట షూ రాక్ వెనకాల దాచి పెట్టాడు. మెట్లు దిగి కిందికి వెళ్ళి బండి తీసుకోబోయాడు.

"ఏటి బాబూ! కాలేజీకా?" వాళ్ళ రూమ్ ముందున్న కుళాయి దగ్గర నైటీలో రత్తాలు పళ్ళు తోముకుంటూ పలకరించింది. విశాల్ గతుక్కుమన్నాడు. "ఇప్పుడేగా బయట ఊడ్చి, ఆ తరవాత స్నానం చేస్తుంటే చూశాను." అనుకుంటూనే "ఏంటి రత్తాలూ..ఇప్పుడే లేచావా?" సందేహ నివృత్తి కోసం అడిగాడు.

"అవును బాబూ...మా ఆయన లేడుగా. రేత్తిరి సరింగా నిదరట్టలేదు." చేతులు పైకెత్తి ఒళ్ళు వెనక్కి విరుచుకుంటూ కొంటెగా అంది రత్తాలు. విశాల్ కు మతిపోయింది. అతనికి సందేహం తీరలేదు. "నువ్వు కాక మీ ఇంట్లో మీ చెల్లెలు గాని, అక్కగాని ఎవరైనా ఉన్నారా రత్తాలూ?" అడిగాడు.

"ఒక్కదాన్నే కదా బాబూ ఉన్నది, ఇప్పుడే లేచినాను. ఏం లోపలి కొచ్చి కుసింతసేపు కూకుంటావా! టిఫిన్ పెడతాను. మీ అమ్మానాన్నా లేరుగా. కాలేజీకి డుమ్మా కొట్టేసేయిలే. సిటంలో తానం సేసి ఒచ్చేస్తా." నవ్వుతూ కన్ను గీటింది. విశాల్ కంగారు పడ్డాడు.

"లేదు..లేదు..నేను కాలేజీకి వెళ్లాలి.." వెనక్కి తిరిగి బండెక్కబోతూ చెప్పాడు.

"సూస్కో బాబూ..మళ్ళీ సాయంత్రం అయితే మా ఆయనా, మీ అమ్మా, నాన్నా కూడా వచ్చేత్తారు..." గూఢంగా నవ్వుతూ అంది.

"వద్దు..వద్దు.." ఖంగారుగా అంటూ బండిని విశాల్. వెనకనుంచి రత్తాలు "హుం" అని నిట్టూర్చడం వినిపించింది." ఓహ్! షిట్!" అనుకుంటూ బండి స్టార్ట్ చేశాడు విశాల్.

★★★

వైజాగ్ నుండి భీమ్లీకి వెళ్ళడానికి మూడు దారులు ఉన్నాయి. అందులో బీచ్ పక్కనుంచి వెళ్ళే దారి అన్నింటికన్నా బాగుంటుంది. దారిపొడుగునా సముద్రపు గాలి పీలుస్తూ హాయిగా వెళ్లవచ్చు.

విశాల్ బండి అధునాతనమైనది. మంచి పిక్ అప్, మంచి స్పీడూ ఇస్తుంది. విశాల్ కొద్దిగా ఎక్కువ వేగంతోనే వెళుతున్నాడు. అలా వెళుతూ వెళుతూ అనుకున్నాడు. "ఒకవేళ నిజంగా ఇప్పుడు రాబందులు కనిపిస్తే? వాటి గురించి తప్పుగా అనుకున్నందుకు నామీద ఎటాక్ చేస్తాయేమో!" నవ్వొచ్చి గట్టిగా నవ్వుకొని బండి స్పీడు పెంచాడు. కొంచెం దూరం వెళ్ళాడో లేదో "డుగ్, డుగ్.." మంటూ బండి ఆగిపోయింది. కాలేజీకి ఇంకా పది కిలోమీటర్ల దూరం ఉంది. విశాల్ కిందకి వంగి పెట్రోల్ వాల్వ్ ని రిజర్వ్ లోకి మార్చాడు. ఇంతలో కుడి వేపు ఉన్న సముద్రం మీదనుంచి భరించరాని దుర్గంధం వచ్చింది. ఏమిటా అని అటు చూశాడు. ఉప్పు నీటిలో నాని నాని, ఉబ్బిపోయి ఇసకలోకి కొట్టుకొచ్చిన గేదె కళేబరాన్ని ఒకటి కాదు..రెండు కాదు.. పదో, పదిహేనో రాబందులు పీక్కుని తింటున్నాయి. విశాల్ కి ఒళ్ళు జలదరించింది. ఖంగారుగా సెల్ఫ్ స్టార్ట్ బటన్ నొక్కి బండి స్టార్ట్ చేశాడు.

"రేయ్! ఆగరా! మమ్మల్ని చచ్చిపోమంటున్నావా నువ్వు? మీ జంతువులు ఏమైనా చస్తే వాటి శరీరాలు కుళ్ళిపోతే మీకు దుర్గంధం రాకుండా మేమే తిని పెడుతున్నాం. అలాంటి మేము అంతరించిపోతే మంచిదని అనుకుంటున్నావా. ఉండు..నీ పని చెప్తాను." మనుషుల భాషలో అంటూ విశాల్ మీదికి ఎగిరెగిరి వచ్చింది, ఒక పెద్ద రాబందు.

విశాల్ గుండె ఆగిపోయినంత పనయ్యింది. "బాబోయ్! నా మనసులో అనుకున్నది వీటికెలా తెలిసింది! పైగా మనిషి భాషలో, తెలుగులో అరుస్తోంది. " భయంతోటీ, ఆశ్చర్యంతోటీ అనుకుంటూ బండి యాక్సిలేటర్ రెయిజ్ చేసి వేగంగా బండిని ముందుకు దూకించాడు.

"రేయ్ ఆగరా..నీ సంగతేమిటో చూస్తాం ఇవ్వాళ..." అంటూ వేగంగా మీదకొచ్చింది ఇందాకటి రాబందు. విశాల్ తలమీద కాళ్ళతో కొట్టి ముక్కుతో పొడవబోయింది. విశాల్ యాక్సిలేటర్ ను పూర్తిగా రైజ్ చేసి ముందుకు వెళ్ళిపోయాడు. "క్రీచ్! క్రీచ్!" మనే ఆ రాబందుల అరుపులు చాలా దూరం వినిపించాయి విశాల్ కు.

. ★★★

కాలేజీకి వెళ్ళి క్లాస్ లో కూర్చున్నాడు. బుర్రంతా రాబందుల ఆలోచనలే. ప్రొఫెసర్ వచ్చారు. ఈ రోజు విషయం ఏమిటంటే "హేల్యూసినేషన్" దీనినే తెలుగులో చిత్తభ్రమ అంటారు. లేనివి ఉన్నట్టూ, ఉన్నవి లేనట్టు అనిపించడమే హేల్యూసినేషన్. ప్రతీ మనిషికీ జీవితంలో ఒక్కసారైనా ఎప్పుడో ఒకప్పుడు హేల్యూసినేషన్ అనుభవమౌతుంది కానీ అందరూ తమ భ్రమలు ఒప్పుకోరు." అంటూ పగటి కలలు ఎలా వస్తాయో అన్నీ వివరంగా చెప్పారు.

"నేను రత్తాలు గురించి ఎక్కువగా ఆలోచించడం వల్ల, ఆమె స్నానం చేస్తుండగా చూడడం, రాబందుల గురించి చదవడంతో ఆ విధమైన హేల్యూసినేషన్ లు ఏర్పడ్డాయి." తేలిగ్గా అనుకున్నాడు విశాల్. సాయంకాలం దాకా సైకాలజీ లోని వివిధ విభాగాల లెక్చరర్లు పాఠాలు చెప్పారు. అతడికి "హేల్యూసినేషన్" అనే సబ్జెక్టే బాగా నచ్చింది.

కాలేజీ ముగిసింది. బండి తీసి స్టార్ట్ చేసి ఇంటిదారి పట్టాడు. వేగంగా వెళుతున్న విశాల్ కి ఉదయం వచ్చిన స్పాట్ దాటుతుంటే ఒక విధమైన భయం వచ్చింది. "ఛీ! ఏమిటిది? వెధవ హేల్యూసినేషన్." అనుకుంటూ బండిని ముందుకు దూకించాడు. బండి సౌండ్ ను డామినేట్ చేస్తూ "క్రీచ్...క్రీచ్.." మనే శబ్దాలు

వినిపించసాగాయి. వెనుకకు చూశాడు. ఒక పెద్ద రాబందు, దాని వెనకాతల ఇంకో పది చిన్న రాబందులు తన వైపే దూసుకు వస్తున్నాయి. "శ్రీఆంజనేయం ...ప్రసన్నాంజనేయం.." అనుకుంటూ బండి స్పీడు ఎనభైలో పెట్టి వేగంగా ఇంటికి చేరాడు. పార్కింగ్ లో బండి పెట్టి, ఓరగా వాచ్ మాన్ రూమ్ వైపు చూశాడు. తలుపులు ఓరగా మూసి ఉన్నాయి. "రత్తాలు ఒక్కత్తే ఉందో, వాళ్ళాయన వచ్చేశాడో.." అనుకుంటూ మెట్లెక్క సాగాడు. "పొద్దున్న రత్తాలు స్నానం చేస్తుంటే దొంగతనంగా చూశాను . ఒకవేళ అమ్మా వాళ్ళకి చెపుతుందేమో?!"అనుకున్నాడు. ఇంకా నాలుగుమెట్లు ఉండగా మెరూన్ కలర్ చీరలో దిగుతూ కనిపించింది రత్తాలు. అపనమ్మకంగా తల విదిలించుకున్నాడు.

"ఏం రత్తాలూ,అమ్మ దగ్గర పచ్చడి కోసం వచ్చావా?" అడిగాడు.

అప్పుడప్పుడూ కూరలు వండుకోనప్పుడు రత్తాలు వీళ్ళింటికి వచ్చి ఏదైనా పచ్చడి తీసుకు వెళ్ళడం ఆమెకి అలవాటే. అందుకని అలాగ అడిగాడు. రత్తాలు విశాల్ వైపు కొరకరా చూసింది. "తమరికి తొందరలో లగ్గం సేపిచ్చమని అమ్మగారికి సెప్పడానికే ఒచ్చాను బాబూ! ఇంకెప్పుడూ పొద్దున్న సేసినట్టు పిచ్చి పనులు సెయ్యకండి. నేను గనక ఊరుకున్నాను గానీ ఎవలూ ఊరుకోరు. మా మావ గనక ఉండి, ఆడికీ ఇసయం తెలిస్తే కొంప కొల్లేరైపోయేది." చెప్పింది రత్తాలు.

మాట్లాడకుండా, ముందుకు కదిలాడు విశాల్. ఎప్పుడు పడిందో తెలియదు కానీ చొక్కా మీద రాబందు ఈక ఒకటి అతుక్కొని ఉంది. "అయితే నేను రాబందులను చూడడం నిజమేనన్న మాట.." గాభరాగా అనుకున్నాడు విశాల్. ఆ ఈకను పైనించి కిందకు విసిరేసి ఇంటి లోపలకి వెళ్ళాడు. పాంటూ, షర్టూ మార్చుకొని తన రూమ్ లోని కుర్చీలో కూర్చోబోయాడు.

"రేయ్! ఇలా రా!" పిలిచాడు విశాల్ వాళ్ళ నాన్నగారు.

"ఏమిటి నాన్నగారూ!" వెళ్ళాడు విశాల్. తీరా దగ్గరికి వెళ్లాక ఆయన ఉగ్రరూపం చూసి భయమేసింది.

"ఏరా! నువ్వు పొద్దున్న చేసిన పనేమిటి? వెధవ వేషాలు వేస్తే ఆఫ్ట్రాల్ ఒక వాచ్ మాన్ చేత కూడా తిట్టించుకోవాల్సి వస్తుంది. అలాగే గనక జరిగితే ఒక్కడే కొడుకువని కూడా చూడకుండా ఇంట్లోంచి బయటికి గెంటేస్తాను." విశాల్ వైపు తీవ్రంగా చూస్తూ తిట్టారు వెంకట్రావు గారు. విశాల్ అవమానమూ , సిగ్గులతో తలవంచుకుని తన గదిలోకి వెళిపోయాడు.

అతనికి జరిగిందేమీ అర్థం కావడం లేదు. నెమ్మదిగా బయటకొచ్చి, తన రూమ్ కిటికీ దగ్గర పొద్దున్న రత్తాలు గురించీ, రాబందుల గురించీ ఆలోచిస్తూ కిందకి చూశాడు. కింద ఎల్లో కలర్ పువ్వుల ప్రింటెడ్ చీరలో బొద్దుగా మెరిసిపోతోంది రత్తాలు. ఆ కలరంటే విశాల్ కు చాలా ఇష్టం. పొద్దున్న స్నానం చేసీ, ఇందాక మెట్లు దిగుతూనూ మెరూన్ కలర్ చీరలో ఉన్నది ఇప్పటికిప్పుడు ఎల్లో కలర్ చీరలోకి ఎలా మారిందో అతనికి ఊహకు అస్సలు అందనేలేదు.

"విశాల్ బావూ! ఇప్పుడైనా ఒక్క పది నిమిసాలు రా బావూ ! వత్తావా? మా మావ ఇంకా రేతిరిగ్గాని రాడు. మీ అమ్మకీ నాన్నకీ సెప్పనులే. ఇది మనిద్దరి మధ్యనే సీకిరెట్టు." కొంటెగా నవ్వుతూ మళ్ళీ చేతులు వెనక్కి విరుచుకుంటూ అంది.

విశాల్ కు ఒళ్ళు మండింది. "ఇప్పుడేగా మా అమ్మకు చెప్పి నన్ను బెదిరించావు. ఇంతలోనే నా మీద ప్రేమ వచ్చేసిందా?" కోపంగా అడిగాడు.

రత్తాలు కంగారుపడింది. "నాను ఆడికి ఎప్పుడొచ్చినాను బావూ..నీ మీన నేనేటికి సెపుతాను?" అంటూనే ఈసారి అతడివైపు ఓరగా చూస్తూ కంటిన్యూ చేసింది. "కాలీగానే ఉన్నాను.. లోనకి రారాదూ... అన్నీ మాటాడుకుందాం. రా..బావూ.. మళ్లీ ఎవరైనా సూసీగల్రు..." హడావుడిగా అంది మళ్ళీ అవకాశం చెయ్యి జారిపోతుందేమోనని.

విశాల్ కు ఒక్కసారిగా బుఱ్ఱ తిరిగి పోయింది. కంగారుగా వెనక్కు తిరిగాడు. సందేహమూ, భయమూ, కన్ ఫ్యూజన్ లతో తల తిరుగుతోంది. ఏది నిజమో, ఏది హాల్యూసినేషనో ఏమీ అర్థం కాలేదు. అతని ముఖం ఎఱ్రగానూ, నల్లగానూ, పాలిపోయి తెల్లగానూ రకరకాల రంగులలోకి మారిపోతూ ఉంది.

@@@###@@@

COMMENTS